# మురికి

**వా**డికి నిండా పదేళ్ళుండవు. కానీ వాడి మొహంలో పసితనపు నిగారింపుకు బదులు పేదరికం బలవంతంగా రుద్దిన ముదురుతనం కన్పిస్తుంది.

పదిరోజుల క్రితమే పార్వతమ్మ యింట్లో పనికి కుదిర్చాడు వాడి నాన్న.

పార్వతమ్మ యిద్దరు కొడుకులూ అమెరికాలో ఉన్నారు. యిక్కడ మిగిలింది ఆమే, ఆమె భర్త. యిద్దరికీ వయసు అరవై దాటింది. ఆయనకు కీళ్ళ నొప్పులు. మనిషి సరిగ్గా నడవలేడు. కూచున్న చోటినుండి లేవాలన్నా నరకమే. ఆవిడకేమో యింటి పనుల్లో తీరికే దొరకదు. అందుకే చేతి సాయంగా ఉండటానికి ఎవరైనా కుర్రాణ్ణి చూసిపెట్టమని పనిమనిషితో చెప్పి పెట్టింది. ఆ పనిమనిషి శీను వాళ్ళ నాన్నతో విషయం చెప్పటమూ, శీను ఆ పనిలో కుదురుకోవటమూ జరిగిపోయాయి.

వాడు వడివడిగా నడుస్తున్నాడు. ఎండాకాలం కావటం వల్ల పదింటికే ఎండ చురుక్కుమంటోంది. పనిమనిషి పదింటికి వెళ్ళిపోతుంది. వాడి పని అప్పట్నుంచే మొదలౌతుంది. బజారుకెళ్ళి సరుకులు కొనుక్కుని రావటం, మెడికల్ షాపుకెళ్ళి మందులు కొనుక్కుని రావటం, బట్టలు యిస్త్రీ చేయించుకు రావటం, అయ్యగారికి సిగరెట్లు తేవటం. కూరగాయలు మాత్రం అమ్మగారే కొంటారు. వాడు సంచి మోయాలి. అంతే .... ఓ రకంగా చెప్పాలంటే వాణ్ణి పన్లో పెట్టుకుందే ఆయనకు చేతికింద సాయంగా ఉంటాడని.

వాడికీ పని హాయిగానే ఉంది. పెద్దగా శ్రమనిపించటం లేదు. హాల్లో గోడకానుకుని కూచుంటాడు. 'ఒరే శీనూ' అని అయ్యగారు పిలవటం తరువాయి... 'వస్తున్నానయ్యా' అంటూ తూనీగలా పరుగెత్తుతాడు. అయ్యగారేదో

వస్తువు కావాలంటారు. తెచ్చిస్తాడు. ఏ పుస్తకమో పేపరో అడుగుతారు, అందిస్తాడు. అప్పుడప్పుడూ కాళ్ళు పట్టమంటారు.

పార్వతమ్మ గారు వంటగదిలో ఉన్నప్పుడు ఫోన్ మోగితే, 'శీనూ... ఆ కార్డ్‌లెస్ యిలా పట్రా' అంటూ కేకేస్తారు. వాడు పరుగెత్తుకెళ్ళి ఫోనందుకుని వంటగది వైపుకు పరుగెత్తుతాడు.

అక్కడే తంటా అంతా. అమ్మగారు అచ్చం పార్వతీ దేవిలానే ఉంటారు. తెల్లటి కళగల మొహం. నుదుట రూపాయి కాసంత కుంకుమ బొట్టు. చూస్తే కాళ్ళకు మొక్కాలనిపించేలా ఉంటారు. ఆమె మొహంలో చిరాకుని వాడీ పదిరోజుల్లో ఎప్పుడూ చూళ్ళేదు. ఎప్పుడూ శాంతంగా ... చల్లటి చూపు ... మృదువుగా, మెల్లగా మాట్లాడ్తారు.

అంతా బావుంది. కానీ పార్వతమ్మ గారికి శుచీ శుభ్రం ఎక్కువ.

హాల్లో ఎక్కడా మరక కన్పించకూడదు. కిటికీలమీద దుమ్ము కన్పించకూడదు. ఆమె కళ్ళకు మురికి కన్పిస్తే వూర్కోదు.

వాణ్ణి పనిలోకి చేర్పించడానికి వాడి నాన్న పిల్చుకొచ్చిన రోజు ఆమె అన్న మాటలు గుర్తొచ్చాయి.

'నాకు శుభ్రం చాలా ఎక్కువ. వీడి బట్టలు చూడు ఎంత మురిగ్గా ఉన్నాయో... ఇలా ఉంటే ఇంటి లోపలికి రానివ్వను. రోజూ శుభ్రంగా ఉతికిన బట్టలే వేసుకు రావాలి. యింట్లోకి వచ్చే ముందు పెరట్లోకి వెళ్ళి కాళ్ళూ చేతులు శుభ్రంగా కడుక్కుని రావాలి. మా పనిమనిషి వెళ్ళిపోయాక యిల్లంతా అద్దంలా ఉంచాల్సిన బాధ్యత వీడిదే. ఎక్కడైనా ఓ చిన్న మట్టి రేణువు కన్పించినా, చిన్న మరక కన్పించినా, చివరికి కాగితమ్ముక్క కన్పించినా వూర్కోను. అన్నింటికంటె నాకు శుభ్రం ముఖ్యం. తెల్సిందా'

ఆమె మాటలు గుర్తుకు రాగానే వేగంగా నడుస్తున్నవాడల్లా రోడ్డు మధ్యలో

ఠక్కున ఆగిపోయాడు. తన ఒంటిమీదున్న చొక్కా వైపు, నిక్కరు వైపు చూసుకున్నాడు. చొక్కా రెండు చోట్ల చిరుగులు పట్టింది. నిన్న వాడే ఉతుక్కున్న జత. వాడికున్నవి రెండు జతలే. పన్లో చేరక ముందు వారానికోసారి ఉతుక్కునేవాడు. ఇప్పుడు అమ్మగారికి కోపం వస్తుందేమోనని రోజూ ఓ జత ఉతుక్కుని మరునాడు వేసుకుంటున్నాడు.

“మీ అయ్యగోర్ని ఓ పాత సొక్కా ఇమ్మని అడుగు... నువ్వేస్కుకుంటే పొడుగ్గా, జుబ్బాలా ఉంటది” అన్నాడు వాడి నాన్న.

శీనుకో అనుమానం వచ్చింది. వాళ్ళయ్య చొక్కా అడగమంది తన కోసమా అతని కోసమా అని. తీరా అడిగి తెచ్చుకున్నాక, ‘నీకెందుకురా అంత పొడవు సొక్కా... నిండా మునిగిపోయావు. నాకిచ్చేయ్. సరిగ్గా సరిపోతది’ అని లాగేసుకుంటాడేమో ...

ఏమైనాసరే ఈరోజు అయ్యగార్ని చొక్కా అడగాలనుకున్నాడు.

నడుస్తూనే తన కాళ్ళవైపు చూసుకున్నాడు. చెప్పుల్లేని కాళ్ళు... దుమ్ము పట్టి ఉన్నాయి. మురికి... అమ్మగారికి ఇష్టంలేని మురికి ... గుడిలాంటి యిల్లు... మురికంటకూడదు. వెళ్ళగానే శుభ్రంగా కడుక్కోవాలి. మురికంతా వదిలేంత వరకు... కడుక్కోవాలి.

వాడు వెళ్ళే సమయానికి పార్వతమ్మ పూజ గదిలోంచి వస్తోంది.

తలారా స్నానం చేసినందువల్ల తడి జుట్టుని ఆరబోసుకుంది. చలువ చేసిన ఖరీదైన ఆర్గండీ చీర... పచ్చటి మేని చాయ ... నుదుట ఎర్రటి కుంకుమ... మొహం ఎప్పటికిమల్లే వింత తేజస్సుతో మెరుస్తోంది.

వాడికి పార్వతమ్మని చూసినపుడల్లా ఆశ్చర్యమే. అంత శుభ్రంగా ... సర్ఫ్ వేసి ఉతికిన తెల్ల చొక్కాలా ...హాల్లోని తెల్లటి పాలరాతిని తడిబట్టతో గట్టిగా తుడిచినప్పుడు మెరిసినట్లు ... ఆమె మెళ్ళోని బంగారు నెక్లెస్ తళతళలా ...

ఉదయం తను గుడిశె బైటికి వచ్చి తూర్పువైపుకు తలయెత్తి చూసినపుడు ముంచెత్తే తెల్లటి సూర్యకాంతిలా ... అమ్మగారి పెరట్లో విరగబూసిన సన్నజాజుల్ని కోసి కుప్పగా పోసినట్లు ... ఎలా సాధ్యం అనుకుంటాడు.

పనంతా చేసుకుని తను రాత్రికి యింటికెళ్ళబోయే ముందుకూడా ఆమె మొహంలో అదే కాంతి ... అదే తేజస్సు. చీర మడతకూడా నలగదు. మొహంలో కాసింత విసుగైనా కన్పించదు. అబ్బో ... ఎంత శుచీ! ... ఎంత శుభ్రం!

“ఏరా ఆలస్యమైందేం”అందావిడ.

వాడికేం చెప్పాలో తెలీలేదు. గోడకున్న గడియారం వైపు చూశాడు. వాడికి టైం ఎలా చూడాలో తెలీదు. ఎండ తీవ్రతని బట్టి, నీడల్ని చూసి ఉజ్జాయింపుగా సమయం ఎంతయి ఉంటుందో చెప్పే విద్య వాడి నాన్న దగ్గర నేర్చుకున్నాడు. అంతే...

“సర్లే... చేతులూ కాళ్ళు శుభ్రంగా కడుక్కుని రా. నీళ్ళు మరీ ఒలకబోయకు” అందామె.

వాడు పెరట్లోకెళ్ళి చేతులూ కాళ్ళు కడుక్కున్నాడు. వాడి నాన్న చినిగిపోయిన లుంగీలోంచి ముక్క చింపి రుమాలుగా మార్చుకుని జేబులో దాచుకున్న గుడ్డతో పొడిగా తుడుచుకున్నాడు.

తడికాళ్ళతో చలువరాతి బండలమీద మరకలు చేయకూడదని మొదటిరోజే పార్వతమ్మ హెచ్చరించింది.

వాడు లోపలికెళ్ళాక ఎప్పటికిమల్లే పార్వతమ్మ వాడివైపు నఖశిఖపర్యంతం నిశితంగా చూసింది.

“తలేమిట్రా మాసిపోయింది? ఆ జుట్టుకు నూనె రాసుకోవా? నీకు చెప్పానా తలకు కొబ్బరినూనె రాసుకుని, నీట్‌గా దువ్వుకుని రావాలని” అందామె.

“యింట్లో నూనె లేదమ్మా” సంజాయిషీ యిస్తున్నట్లు తలొంచుకుని చెప్పాడు.

"అంగట్లో ఉంటుందిగా"

"డబ్బుల్లేవమ్మా" అన్నాడు. ఆమె ఏమీ మాట్లాడకపోవటం చూసి, పొడిగింపుగా "రాత్రుళ్ళు దీపంలోకి మట్టినూనె కొంటానికే డబ్బుల్లేవంటాడు మా అయ్య. కొబ్బరినూనె అడిగితే కొడ్తాడమ్మా"అన్నాడు.

"సర్లె...కిటికీలన్నీ దులుపు. దుమ్ముపట్టేసి ఉన్నాయి. వాటి అద్దాల్ని మరకల్లేకుండా బాగా తుడువు"

వాడా పనిలో నిమగ్నమైనాడు. చేతులు యాంత్రికంగా పని చేసుకుపోతున్నా మనసులో మాత్రం పాతచొక్కాని ఎలా అడగాలో పదేపదే రిహార్సల్స్ వేసుకుంటున్నాడు.

"అదేం తుడవటంరా? అక్కడచూడు ... దుమ్ముంది ... కన్పడటంలేదా?"

ఆలోచనల్లో మునిగి ఉన్న శీను పార్వతమ్మ గొంతు విని ఉలిక్కిపడ్డాడు.

ఆమె చూపిస్తున్న వైపు జాగ్రత్తగా చూసాడు. వాడి కళ్ళకు దుమ్ము అణువంతైనా కన్పించలేదు.

"ఈ అద్దంపైన చూడు... మరక... గట్టిగా రుద్ది తుడవాలని చెప్పానా? గట్టిగా అంటే మరీ గట్టిగా కాదు. అద్దం పగిలిపోగలదు."

వాడా అద్దం వైపు కళ్ళు విప్పార్చి మరీ చూశాడు. అద్దం అద్దంలా తళతళా మెరుస్తోంది తప్ప మరక కన్పించలేదు.

తనక్కనిపించని మరక ఆమెకెలా కన్పిస్తుందో వాడికర్థం కాలేదు. మధ్యాహ్నం ఒంటిగంట దాటింది. వాడికి ఆకలి వేస్తోంది.

పార్వతమ్మ, ఆమె భర్త డైనింగ్ టేబుల్ దగ్గర భోజనాలకు కూచున్నారు. కంచాల, గిన్నెల శబ్దాలు... వేడి అన్నంమీంచి మూత తీసిన వెంటనే వచ్చే కమ్మటి వాసన... కూరల ఘుమఘుమలు... వాడికి ఆకలి మరింత పెరిగింది.

ఎండ నిప్పులు చెరుగుతోంది.

అన్నం తింటానికి యింటికెళ్ళాలి... ఈ ఎండలో... నడుచుకుంటూ.... చెప్పుల్లేకుండా...అమ్మో! కాళ్ళు నిప్పల కుంపటిలో కూరుకు పోయినట్లు కాలుతుంటాయి. కడుపులో ఆకలి అగ్నిగుండంలా మండుతో ఉంటుంది. నెత్తి పెనంలా మాడుతో ఉంటుంది.

ఈపూటకి తినకపోతేనేం – మానేస్తాను అనుకున్నాడు. కానీ ఆకలి... కడుపులో సూర్యగోళం ఉన్నట్లు ... భగభగ మండుతూ ... బైటి ఎండే నయం అన్పించింది.

అమ్మగారు నాలుగు ముద్దలు అన్నం పెడితే ఎంత బావుంటుంది! యిక్కడే తిని, కావాలంటే యింకాస్త ఎక్కువ పని చేస్తాను కదా... వాడిలో ఆశ పొంగుతూ...

కానీ ఈ పదిరోజుల్లో పార్వతమ్మ గారు ఒక్క మెతుక్కూడా విదల్చని విషయం గుర్తొచ్చి వాడి ఆశ చన్నీళ్ళ స్పర్శలో ఒదిగిన పాలపొంగైంది.

వాడు పని ఆపేసి, “యింటికెళ్లి బువ్వ తినొస్తానమ్మా”అన్నాడు.

“సరే. తొందరగా రా. తిని పడుకోకు” అందామె.

వాడు బైటికి వస్తున్నప్పుడు అయ్యగారి మాటలు విన్పించాయి.“ యింతెండలో ఎక్కడికి పోతాడు? ఓ ముద్ద పడేస్తే తిని యిక్కడే పడుంటాడుగా”

“మీకేం తెలీదు. వూర్కోండి. పనోళ్ళని పాపం అంటే నెత్తికెక్కి కూచుంటారు. ఐనా కేజీ పదహారు రూపాయలు పెట్టికొన్న సోనా మసూరి బియ్యం... వాడికెలా పెడ్తాను?”

ఆ మాటలు విన్నాక వాడికి ఎండ వేడిగా అన్పించలేదు.

తిరిగొచ్చేప్పుడు... నడిస్తే కాళ్ళు కాల్తాయని పరుగెత్తుకుంటూ వచ్చాడు. ఐనా కాళ్ళు బొబ్బలెక్కేలా కాలాయి.

ఎప్పటికిమల్లె రాత్రి ఏడింటికే వాళ్ళిద్దరూ భోజనాలు చేశారు. అంట్లన్నీ తీసి సింక్‌లో వేసేప్పుడు కూడా వాడు చొక్కా అడగటం గురించే ఆలోచిస్తున్నాడు.

పనంతా ఐపోయినా వెళ్ళకుండా నిలబడ్డ శీను వైపు 'ఏమిటి?' అన్నట్లు ప్రశ్నార్థకంగా చూసింది పార్వతమ్మ.

ఎలా అడగాలో తెలీని సందిగ్దావస్థలో వాడేమీ సమాధానం చెప్పలేదు.

"ఏంటో చెప్పు" అందావిడ.

"అయ్యగోరి పాత సొక్కా ఏదైనా యిప్పించమ్మా"అన్నాడు గొంతు పెగుల్చుకుని.

"నీకా మీ నాన్నకా?"

"నాకేనమ్మా. పొడుగైనా సరే తొడుక్కుంటా. నాకాడ రెండే సొక్కాలున్నాయి" అలా అంటున్నప్పుడు వాడి మొహంలో దీనత్వం.

పార్వతమ్మ వాడివైపో క్షణం దీర్ఘంగా చూసింది. ఈ అడుక్కునే వెధవలందరికీ నటన పుట్టుక నుంచీ వస్తుందేమో... "పాత చొక్కాలేమీ లేవు. ఐనా పన్లోకి చేరి పదిరోజులైనా కాలేదు. అప్పుడే పాత చొక్కాలు అడిగేస్తున్నావే"

శీనుకి ఆవిడ ఉద్దేశం అర్థం కాలేదు.

"పోనీ ఓనెల పోయాక యివ్వండమ్మా" అన్నాడు అమాయకంగా.

"ఉంటే కదా యివ్వడానికి. వెళ్ళు" ఆమె గొంతులోని మృదుత్వంలో మార్పు లేదు.

వాడు నిరాశని మోస్తూ బైటికి నడిచాడు.

ఆమె తలుపేసుకుంది.

అడిగే విధానంలో అడగలేదా? ఎలా అడగాలో తనకు తెలీలేదా? అనే

మీమాంసలో శీను ఓ నిమిషం అక్కడే నిలబడ్డాడు.

"బోల్డు పాత చొక్కాలు పడున్నాయి. నేను వాడటం కూడాలేదు. వాడికొకటిస్తే పోయేదిగా. పాపం పేద కుర్రోడు" అయ్యగారి మాటలు విన్పించాయి.

"మీకు ఈ పనోళ్ళ వేషాలు తెలీవు వూర్కోండి. పన్లోకి చేరి పది రోజులు కాకుండానే చొక్కా అడిగాడు. రేపు వాళ్ళమ్మ కోసం పాత చీర అడుగుతాడు. మరో వారం పోతే కొత్త బట్టలు కొనివ్వమని డిమాండ్ చేస్తాడు. చాలా నీచమైన మనుషులు. ఒంటి మీదే కాదు బుద్ధినిండా మురికే వీళ్ళకి. వాళ్ళనెక్కడ పెట్టాలో అక్కడ పెడితేనే మంచిది" పార్వతమ్మ గొంతు... మృదువుగా...

★ ★ ★

వాడు పన్లోకి చేరి మూడు వారాలైంది.

అమ్మగారు ఏ సమయంలో చూసినా అంత శుభ్రంగా ఎలా ఉంటారో... మాటల్లో కోపమో చిరాకో లేకుండా అంత ప్రశాంతంగా, మృదువుగా ఎలా మాట్లాడతారో... వాడు ఆలోచిస్తూ నడుస్తున్నాడు. కసుక్కున కాల్లో గాజుపెంకు గుచ్చుకుంది. "అమ్మా"అంటూ అక్కడే కూలబడ్డాడు.

పళ్ళబిగువున బాధని భరిస్తూ గాజుపెంకుని కాల్లోంచి లాగేశాడు. రక్తం...బొటబొటా కారిపోతూ...యింత మట్టి తీసుకుని అదిమి పట్టాడు.

కుంటుతూనే పార్వతమ్మ యింటికి నడిచాడు.

"ఏమైందిరా"అందామె గడప దగ్గరే.

"కాల్లో గాజుపెంకు గుచ్చుకుందమ్మా"

'అయ్యో అలానా' అంటుందనుకున్నాడు. గాయానికి రాయడానికి ఏదైనా మందు యిస్తుందనుకున్నాడు. యింటినిండా రకరకాల మందు బిళ్ళలు, సీసాలు ఉన్నాయిగా. కట్టుకట్టే గుడ్డకూడా ఉంది.

"నువ్వు కాళ్ళు కడుక్కుని రా. నీ దగ్గర కాళ్ళు తుడుచుకునే గుడ్డ ఉందిగా. గాయానికి గట్టిగా కట్టుకో. హాల్లో మరకలు పడితే నేనూర్కోను. అసహ్యంగా ఉంటుంది" అందామె.

వాడు పెరట్లోకెళ్ళి, నీళ్ళతో గాయాన్ని కడిగి, తన జేబులో ఉన్న పాత లుంగీ ముక్కతో కట్టు కట్టాడు. నడవటం కష్టంగా ఉంది. గాయం సలుపుతోంది. ఐనా వాళ్ళు చెప్పిన పన్లన్నీ చేశాడు. వాళ్ళు అందివ్వమన్నవన్నీ అందించాడు.

మధ్యాహ్నమయ్యేప్పటికి వాడి ప్రాణం డస్సి పోయింది. నిస్త్రాణగా అన్పించింది. పార్వతమ్మ భర్తతో కలిసి భోజనానికి కూచుంది. శీను కదలకపోవటం చూసి, "ఏరా అన్నానికెళ్ళవా?"అని అడిగింది.

"కాలు నొప్పిగా ఉందమ్మా. నడవటం శానా కట్టంగా ఉంది"

"మరి అన్నం తినకుండా ఉండగలవా ? సరే నీ యిష్టం"

"యింతెండలో ఆ కాలికి గాయంతో వాడేం వెళ్ళగలడు? ఏమైనా పెట్టు తింటానికి"అన్నాడాయన.

"ఏముంది పెట్టటానికి? అన్నం ఎప్పటిలానే మనిద్దరికి సరిపోయేంతే వండాను."

అతనేమీ మాట్లాడలేదు.

భోజనాలయాక ఆమె ఫ్రిజ్జంతా వెదికింది. పనికిరాని, పారేయదగిన ఆహార పదార్థాల కోసం...

రెండు బ్రెడ్ ముక్కలు కన్పించాయి.

శీను చేతిలో పెట్టి "తినరా"అంది.

వాడు ఆకలి మీదున్నాడేమో ఆబగా నోట్లో పెట్టుకున్నాడు. పులిసిన వాసన... చేదు విషంలా... గొంతు దిగటం లేదు. వాంతికొచ్చేట్లుంది. పార్వతమ్మ చూస్తే

ఏమైనా అనుకుంటుందని వాడు బైటికెళ్ళి మిగిలిన బ్రెడ్‌ని పడేశాడు. వాంతికయింది. పెరట్లోని నీళ్ళతో నోరంతా ఎంత కడుక్కున్నా అదోరకమైన అరుచి వదలటం లేదు. వళ్ళంతా సలపరంగా అన్పించింది.

“జొరం వచ్చినట్లుందమ్మా. యింటికెల్తా”అన్నాడు. వాడిపోయి, వదలిపోయినట్లున్న వాడి మొహం వైపు ఓ క్షణం చూసి,“ సరే వెళ్ళు. కానీ ఈ పూట మానేసినందుకు నీ జీతంలోంచి డబ్బులు కట్ చేస్తాను”అందామె. వాడేమీ మాట్లాడలేదు. ఆమె వైపు చూశాడు. తెల్లటి మొహంలో రూపాయి కాసంత ఎర్రటి బొట్టుతో, పాలనురగలాంటి చీరలో ఆమె ఎప్పటికిమల్లె దేవతలా ఉంది. అద్దాన్ని ఎంతబాగా తుడిచినా తనక్కనిపించని మరక అమ్మగారికి కన్పించినట్లు... యిపుడు వాడి కళ్ళకు కన్పిస్తోన్న మరక...

వాడు బైటికెళ్ళగానే విసురుగా తలుపేసింది. “మురికి వెధవ” గొణుక్కుంటున్నట్లుగా అంది.

*(ఆంధ్రభూమి వారపత్రిక. 9 జూన్ 2005)*

★ ★ ★